తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ| జనగాం |ములుగు నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం అసిఫాబాద్
మహబూబాబాద్
ఆదివారం
22 ఫిబ్రవరి 2026
పేజీలు - 8



# కోటంచలో వెల్లి విరిసిన ఆధ్యాత్మికం

- కన్నులపండువగా పునఃప్రతిష్టాపన మహోత్సవం
- లక్ష్మినరసింహ స్వామి ఆలయంలో చిన్న జీయర్ స్వామి ప్రత్యేక పూజలు
- హాజరైన తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- కొత్త శోభను సంతరించుకున్న ఆలయం







**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కొడవటంచలో ఆధ్యాత్మికం వెల్లివిరిసింది. లక్ష్మీనరసింహ స్వామి విగ్రహ పునః ప్రతిష్టాపన కార్యక్రమానికి శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి, తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. రూ. 12 కోట్ల 15లక్షలతో నూతనంగా పునర్నిర్మించిన కోటంచ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం కొత్త శోభను సంతరించుకుంది. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం తరహాలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రత్యేక చొరవ తీసుకొని, నిధులు మంజూరు చేయించి, కోటంచ ఆలయాన్ని అత్యాధునికంగా, యుద్ధ ప్రాతిపదికన పునర్నిర్మాణానికి విశేష కృషి చేశారు. ఈ ఆలయ నిర్మాణంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అయితే జాతర సమయం సమీపిస్తుండడంతో ఆలయ నిర్మాణ పనులు పూర్తిచేసి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఈ నెల 18 నుండి 21 వరకు ప్రత్యేక పూజలు వేదమంత్రాలతో కన్నుల పండువగా నిర్వహించారు. ఈ నెల 26 నుండి మార్చి 5 వరకు స్థానిక ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున జాతర మహోత్సవం కార్యక్రమాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా విగ్రహ పునః ప్రతిష్టాపన కార్యక్రమాలను శనివారం శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా, అర్చకులు, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, పద్మ దంపతుల సమక్షంలో అత్యంత వైభవంగా శ్రీ లక్ష్మీనరసింహ స్వామి విగ్రహ పునః ప్రతిష్టాపన కార్యక్రమం జరిగింది.

**భక్తి భావంతో మెలగాలి: చిన్న జీయర్ స్వామి..**

దైవం ముందు మనుషులంతా సమానమేనని, అందరూ భక్తి భావంతో మెలగాలని శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి అన్నారు. కోటంచ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో విగ్రహ పునః ప్రతిష్టాపన కార్యక్రమం అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభా వేదికలో చినజీయర్ స్వామి మాట్లాడుతూ దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలని, అవి మనిషిలో మంచి పరివర్తన తెచ్చే నిలయాలు కావాలని అన్నారు. కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని పునర్నిర్మించడం ఆనందదాయకమని ఈ ప్రాంత భక్తులతో ఈ దేవాలయం ఆధ్యాత్మిక కేంద్రంగా విరజిల్లుతుందని చెప్పారు. దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా అందరికీ మంచి చేసేలా ఉపయోగపడాలన్నారు.

**మార్గదర్శకంగా కోటంచ ఆలయం అభివృద్ధి: స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్..**

కోటంచ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం అభివృద్ధి అందరికీ మార్గదర్శకంగా ఉందని, మంచి చేసే వారికి ఎల్లప్పుడూ భగవంతుని ఆశీస్సులు ఉంటాయని రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. కోటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో విగ్రహ పునః ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాసనసభ స్పీకర్ స్థానిక వేదికపై మాట్లాడుతూ కోటంచ దేవాలయ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 12.15 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు స్థానిక శాసనసభ్యులు కోరిన విధంగా అదనపు నిధుల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం సభాపతి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలు: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు..**

దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలని, అవి సామాజిక ఐక్యతకు ప్రతీకలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. కొడవటంచలో ఈ చారిత్రక దేవాలయం పునఃప్రతిష్ఠ జరగడం శుభసూచకమని పేర్కొన్నారు. భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో చిన్న జీయర్ స్వామి ప్రవచనాలు, కళాకారుల ఆటపాటలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విగ్రహ పునః ప్రతిష్టాపన కావడంతో భక్తుల తాకిడి పెరిగి, ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి సిరిశెట్టి సంకీర్త్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, దేవాలయ చైర్మన్, దేవాదాయ శాఖ అధికారి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి దేవాదుల సమ్మక్క సారక్క ప్రాజెక్టుల సందర్శన

- సీఎం రేవంత్ రెడ్డి ప్రాజెక్టు ల పర్యటనను విజయవంతం చేయాలి
- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మండల ఇంచార్జి ఇర్సవడ్ల వెంకన్న



**ఏటూరునాగారం, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) :** ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని తుపాకుల గూడెం గ్రామంలోని దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు మరియు సమ్మక్క సారక్క బ్యారేజ్ ల సందర్శన మరియు పరిశీలించుటకై సీఎం రేవంత్ రెడ్డి, మరియు మంత్రి మండలి బృందం విచ్చేయుచున్న సందర్భంగా ఏటూరునాగారం మండలంలోని జిల్లా, బ్లాక్, మండల, గ్రామాల నాయకులు, సర్పంచులు, అన్ని అనుబంధ సంఘాల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు అందరూ భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## రెండేళ్ల ప్రగతిపై వాడవాడకు ఎమ్మెల్యే నాయిని

- రెండేళ్లలో చేసిన అభివృద్ధి ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం
- జరగాల్సిన అభివృద్ధి పనులను నేరుగా పరిశీలించనున్నాం
- రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నాం
- డివిజన్ పర్యటనలో ఎమ్మెల్యే నాయిని.. మేయర్ గుండు సుధారాణి



**హనుమకొండ ప్రతినిధి, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో పశ్చిమ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 26 డివిజన్ లలో డివిజన్ పర్యటన ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే తొలుత 4 వ డివిజన్ లో రెండేళ్ల ప్రగతిపై మన వాడకు మన నాయిని కార్యక్రమం నిర్వహించారు.

వార్త మెయిన్ 7లో

## మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది



**చెన్నారావుపేట, ఫిబ్రవరి 21 ( జనం సాక్షి):** మృతుల కుటుంబాలను నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి శనివారం పరామర్శించారు. బిఆర్ఎస్ మండల నాయకులు, అమీనాబాద్ గ్రామానికి చెందిన కడుదూరి సంపత్ రెడ్డి నానమ్మ కడుదూరి రాజమల్లమ్మ అనారోగ్యంతో మరణించింది. విషయం తెలుసుకున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆమె మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే లింగగిరి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఓరుగంటి నర్సింహారావు రోడ్డు ప్రమాదంలో మరణించగా ఆయన మృతదేహం పై పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అదేవిధంగా అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన వెంట బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బాల్నె వెంకన్న, మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్, నెక్కొండ మండల సీనియర్ నాయకులు గటిక అజయ్ కుమార్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అమ్మ రాజేష్, మండల ప్రధాన కార్యదర్శి మాదారపు శ్రీనివాస్, అమీనాబాద్ మాజీ సొసైటీ చైర్మన్ మురహరి రవి, గ్రామ పార్టీ అధ్యక్షులు నార్లపురం ఐలయ్య, కడారి సాయిలు, పరకాల రాజన్న, లింగగిరి సర్పంచ్ మేడబోయిన రజిత కుమారస్వామి, మండల నాయకులు ఎర్ర మల్లారెడ్డి, మండల సోషల్ మీడియా ఇన్చార్జ్ బోడ మురళి నాయక్, గొర్ల సంఘం అధ్యక్షులు కడారి బీరయ్య, మండల ఉపాధ్యక్షులు మరాటి రాజు, గ్రామ యూత్ అధ్యక్షులు మురహరి రంజిత్, ముసుకు ఐలయ్య, ఎర్ర రాజన్న, మోగులోజు నాగన్న, గోవింద్ సంపత్, సిద్ధన రమేష్, కడుదూరి రాజు, కాట్ల రాములు, సముద్రాల యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ముందు ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయని కాంగ్రెస్
## బిఆర్ఎస్ యువ నాయకులు కొర్ర మోహన్



**చెన్నారావుపేట, ఫిబ్రవరి 21 ( జనం సాక్షి):** ఎన్నికల ముందు ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం చెందిందని జల్లి గ్రామ బిఆర్ఎస్ యువ నాయకులు కొర్ర మోహన్ అన్నారు. శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల అకౌంట్లలో ఇప్పటివరకు పెట్టుబడి సాయం కింద రైతు బంధు డబ్బులను వేయలేదన్నారు. అంతే కాక ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఊసే లేదని, నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాల జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదన్నారు. మహిళలకు నెలనెలా అందించే రూ. 2500 ఊసే లేదని, పింఛన్ల పెంపు జాడేలేదని, కళ్యాణ లక్ష్మి డబ్బులతో పాటు తులం బంగారం, స్కూటీ, ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ.12 వేలు, విద్యార్థులకు విద్యా భరోసా కింద రూ. 50 వేలు, ఉచిత గ్యాస్ సబ్సిడీ, రైతుల బోనస్ అన్ని అటకెక్కాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత 100 రోజుల్లో ఇస్తామని చెప్పి 26 నెలలు గడుస్తున్న పూటకో మాట మారుస్తూ పబ్బం గడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా ఇచ్చిన గ్యారంటీ హామీలను వెంటనే ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు.

## సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



**దస్తూరాబాద్, ఫిబ్రవరి 21 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని రేవోజీపేట గ్రామంలో శనివారం సైబర్ నేరాలపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేసామని ఏఎస్ఐ భీంరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల జరుగుతున్న సైబర్ మోసాలు అధికంగా ఉన్నాయని, ప్రజలు ఇటువంటి వాటిని నమ్మి మోసపోవద్దని ఆయన అన్నారు. ఇటీవల బ్యాంకు నుండి పంపిస్తున్నామని .జీజూని అనే ఒక ఫైల్ ని వాట్సాప్ ద్వారా చరవాణి కి సైబర్ మోసగాళ్లు పంపిస్తున్నారని అది తెరిచి చూస్తే మన ఖాతా లో ఉన్న డబ్బులు వారి ఖాతాలోకి వెళ్తున్నాయని అటువంటి వాటిని ఎట్టి పరిస్తుతుల్లో తెరువకూడదని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరు ఇటివంటి వాటి నుండి చాలా దూరంగా ఉండాలని ఆయన అన్నారు. తెలియని వ్యక్తులకు ఓటీపీ లు, వ్యక్తిగత సమాచారం ఇవ్వకూడదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోలా మహేష్, ఉపసర్పంచ్ కిషోర్, వార్డు సభ్యులు, కానిస్టేబుల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కేయూలో 9వ వార్షిక తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ ఘన ప్రారంభం



**హనుమకొండ ప్రతినిధి, ఫిబ్రవరి 21. (జనం సాక్షి) :**హనుమకొండ కాకతీయ యూనివర్సిటీ సెనేట్ హాల్‌లో “9వ వార్షిక తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్” ఘనంగా ప్రారంభమైంది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆచార్యులు, తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ అధ్యక్షులు ఆచార్య ఈ. సుధారాణి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “చరిత్ర అనేది కేవలం గతాన్ని నమోదు చేసే ప్రక్రియ మాత్రమే కాదు; వాస్తవ ఆధారాలపై నిలిచే పరిశోధన ద్వారానే మన భవిష్యత్తుకు దృఢమైన పునాది వేయగలం” అని పేర్కొన్నారు. వరంగల్ నగరం తెలంగాణ చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని, కాకతీయుల కళాసంపద నుంచి ఆధునిక సామాజిక ఉద్యమాల వరకు ఈ నేల చరిత్రకు సాక్ష్యమని అన్నారు. తెలంగాణ చరిత్రను వెలుగులోకి తేవడంలో చరిత్రకారులు, పురావస్తు శాస్త్రవేత్తలు, రచయితలు, పరిశోధకులు చేసిన కృషిని కొనియాడారు. తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ 1956 నుంచి రాష్ట్ర చరిత్ర, రైతాంగ పోరాటాలు, సామాజిక సంస్కరణలు, సాంస్కృతిక పునరుజ్జీవనం, ప్రజాస్వామ్య ఆకాంక్షల వంటి అంశాలపై సమగ్ర అధ్యయనం చేస్తూ శాస్త్రీయ వేదికగా నిలుస్తోందని తెలిపారు. గౌరవ అతిథిగా విచ్చేసిన సోషల్ సైన్సెస్ విభాగాల డీన్ ఆచార్య బి. సురేష్ లాల్ మాట్లాడుతూ “ఆరంజ్ ఎకానమీ”లో సంస్కృతి, విలువల వ్యవస్థల ద్వారా విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ఆదివాసీ, గిరిజన సమాజాల చరిత్రలను వెలికితీయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య జి. వెంకటరాజం మాట్లాడుతూ 2007 సంవత్సరం నుంచి సంస్థ విస్తృత వ్యాప్తికి కృషి చేస్తున్నామని, భవిష్యత్ తరాలకు చరిత్ర సేవలు అందించడం లక్ష్యమని అన్నారు. మాజీ అధ్యక్షులు ఆచార్య జి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ హిస్టరీ కాంగ్రెస్‌కు అనేక వేదికలను అందించి ప్రోత్సహించిందని తెలిపారు. తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అంకం జయప్రకాశ్ మాట్లాడుతూ సంస్థకు 400 మందికి పైగా శాశ్వత సభ్యులు ఉన్నారని, యువ పరిశోధకులు పరిశోధనలపై మరింత శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా అతిథుల చేతుల మీదుగా “తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ 8వ వార్షిక సమావేశాల నివేదిక” ఆవిష్కరించబడింది. కార్యక్రమంలో ఆచార్య జి. దయాకర్, ఆచార్య పాండ్య భుఖ్య, సిక్కిం యూనివర్సిటీ ఆచార్యులు ఆచార్య జి. విజయకుమార్, ఆచార్య టి. దయాకర్ రావు, ఆచార్య రాజశేఖర్ బాబు, ఆచార్య వదన్నం, ఆచార్య లావణ్య, ఆచార్య బండి శ్రీనివాస్, ఆచార్య టి. మనోహర్, ఆచార్య యాదవ రెడ్డి, విశ్రాంత ఆచార్యులు ఆచార్య శ్రీనాద్, ఆచార్య విజయబాబు, ఆచార్య పి. మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మొదటి రోజు సదస్సులో మూడు స్మారక ఉపన్యాసాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఉప్పరపల్లి ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం


- పాలిటెక్నిక్ విద్యా ఉద్యోగ అవకాశాలపై సమగ్రంగా వివరించిన నల్గొండ పాలిటెక్నిక్ లెక్చరర్ వెంకటేశ్వర్లు..




**చెన్నారావుపేట, ఫిబ్రవరి 21( జనం సాక్షి):** మండలంలోని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రత్యేక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తేజావత్ జయ అధ్యక్షత వహించారు. ప్రత్యేక ఆహ్వానితుడిగా నల్గొండలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ లెక్చరర్, ఉప్పరపల్లి హై స్కూల్ పూర్వ విద్యార్థి వెంకటేశ్వర్లు హాజరై విద్యార్థులకు పాలిటెక్నిక్ విద్యావకాశాలపై సమగ్రంగా వివరించారు. ఉప్పరపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తేజావత్ జయ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. పాఠశాలలో బోధనతో పాటు విలువల విద్య, నైతికత, క్రమశిక్షణ వంటి అంశాలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని కృషి చేస్తే మంచి ఫలితాలు సాధించగలరని ఆమె ప్రోత్సహించారు. పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాల పేరు ప్రఖ్యాతలు నిలబెట్టాలని కోరారు. ఈ సందర్భంగా పాలిటెక్నిక్ లెక్చరర్, పూర్వ విద్యార్థి వెంకటేశ్వర్లు పదో తరగతి అనంతరం పాలిటెక్నిక్ విద్య ఎంతో మంచి అవకాశాలను కల్పిస్తుందని తెలిపారు. ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సులు మూడు సంవత్సరాల వ్యవధిలో పూర్తి చేసి, తక్కువ ఖర్చుతో మంచి సాంకేతిక నైపుణ్యాలను సంపాదించవచ్చని చెప్పారు. అనంతరం బీటెక్‌లో లేటరల్ ఎంట్రీ ద్వారా రెండవ సంవత్సరంలో చేరే అవకాశం ఉందని వివరించారు. అలాగే పాలిటెక్నిక్ కోర్సులలో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ వంటి విభాగాలపై వివరించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఫీజులు తక్కువగా ఉండటం, స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉండటం వల్ల గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఇది మంచి మార్గమని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ఆసక్తి, సామర్థ్యాలకు అనుగుణంగా కోర్సులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. సమావేశంలో తల్లిదండ్రులు తమ సందేహాలను వ్యక్తం చేయగా లెక్చరర్ వెంకటేశ్వర్లు వాటిని నివృత్తి చేశారు. విద్యార్థుల హాజరు, అభ్యాసన స్థాయి, పరీక్షా ఫలితాలపై ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థుల అభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పరస్పర సహకారం అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాలలను సందర్శించిన ఇంటర్నల్ టీం అధికారులు

### పదవ తరగతి విద్యార్థుల రికార్డుల పరిశీలన



**చెన్నారావుపేట, ఫిబ్రవరి 21 ( జనం సాక్షి)** మండల కేంద్రంలోని సిద్ధార్థ గురుకుల హైస్కూల్, సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల (దుగ్గొండి) పాఠశాలలను ఇంటర్నల్ టీం అధికారులు శనివారం సందర్శించారు. ఈ సందర్శనలో పదవ తరగతి విద్యార్థుల రికార్డులు, ఫార్మటివ్ మార్కుల రికార్డులు, మూలాంకన విధి విధానాలను క్షుణ్ణంగా పరిశీలించారు .ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. అలాగే పదవ తరగతి వార్షిక పరీక్షలలో విద్యార్థులు అధిక సంఖ్యలో ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నల్ టీం అధికారులు మానుపాటి పాపమ్మ, బోయినపల్లి ప్రభాకర రావు, టీమ్ సభ్యులు పోలెపల్లి రవి, కుంటపల్లి సంతోష్ కుమార్, నల్లతీగల యాకయ్య, కొండా కృష్ణమూర్తి, ప్రధానోపాధ్యాయులు అండెం కరుణాకర్ రెడ్డి, జి. విజయలక్ష్మి, ఉపాధ్యాయులు రమేష్, వేణు, గణేష్, కళ్యాణ్, వెంకటేశ్వర్లు, ప్రసాద్, చేరాలు, భద్రు, రజిని, గ్లోరి, సుమలత, కవిత, అనూష, స్వప్న, సీఆర్పీలు సంపత్, బాలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన ఆశ్రమ పాఠశాల మైనార్టీ గురుకులల ఆకస్మిత తనిఖీ

## జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**మహబూబాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 20 (జనం సాక్షి):** జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ శుక్రవారం సాయంత్రం కురవి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ (బాలికల) పాఠశాల మరియు మహబూబాబాద్ పట్టణంలోని మైనారిటీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ (బాలురూ)లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టడీ అవర్‌లో జరుగుతున్న కంప్యూటర్ ఇతర తరగతులను స్వయంగా పరిశీలించారు. పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, ఉదయం?సాయంత్రం స్టడీ అవర్స్ పెంచాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన డైట్ మెనూ అందించాలని, పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే చదువులో దృష్టి పెడతారని తెలిపారు. అందుకు ఉపాధ్యాయులు, వార్డెన్లు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే ప్రత్యేక అధికారులు తమ మండలాల్లోని సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేసి, ఉత్తమ ఫలితాల కోసం వార్డెన్‌లు మరియు ప్రిన్సిపల్‌లకు తగిన సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని, షెడ్యూల్ ప్రకారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. తరగతి గదులు, వంటగది, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. పిల్లలకు నూతన డిజిటల్ తరగతులు సులభంగా అర్థమయ్యే విధంగా బోధించాలని, తాజా మరియు స్వచ్ఛమైన ఆహార పదార్థాలు ఉపయోగించాలని చెప్పారు. వంట సిద్ధం చేసిన అనంతరం ఉపాధ్యాయులు తప్పనిసరిగా రుచి చూసి పిల్లలకు అందించాలని స్పష్టం చేశారు. పిల్లలకు అందించే భోజనంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో సంబంధిత వార్డెన్లు ప్రిన్సిపల్‌లు పాల్గొన్నారు.

# భూ భారతి భూముల రిసర్వే గురించి అవగాహనా సదస్సు



**దస్తూరాబాద్, ఫిబ్రవరి 21 (జనంసాక్షి ) :** మండల కేంద్రంలోని రేవోజీపేట్ గ్రామంలో శనివారం భూ భారతి భూముల రి సర్వే గురించి అవగాహనా సదస్సు సర్పంచ్ కోలా మహేష్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్యాహిచడం జరిగినదని తహసీల్దార్ కనక యాదవ్ రావు అన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ గ్రామ సభలో రి సర్వేలో మొదట గ్రామ హద్దులు నిర్ణహించడం జరుగుతుందని, తరువాత గ్రామంలో గల సర్వే నెంబర్ కోలతలు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. సర్వే లో భాగంగా సర్వే చేయు ముందు పట్టాదార్ కు నోటీసు ఇవ్వడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో ఆర్ఐ ఆర్థిక, సీనియర్ అసిస్టెంట్ సంతోష్, సర్వేయర్ ప్రవీణ్, జీపీఓవెంకటేష్, వార్డ్ సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు

## డిసిపి ఎగ్గడి భాస్కర్



**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి21(జనంసాక్షి) :** చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మంచిర్యాల డిసిపి ఎగ్గడి భాస్కర్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల క్యాతనపల్లి మున్సిపాలిటీకి సంబంధించిన చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నిక విషయంలో జరిగిన పరిణామాలను దృష్టిలో పెట్టుకొని సామాజిక మాధ్యమాలలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకూడదని రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు. అలాగే రాజకీయ పార్టీలకు అనుకూలంగా పోలీస్ యంత్రాంగం పనిచేయదని చెప్పారు. రాజకీయ పరిణామాలలో పట్టణంలో ఎలాంటి సంఘట నలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ఎస్సై శ్రీధర్ కు సూచించారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి ఏసిపి రవికుమార్, మందమర్రి సిఐ పర్స రమేష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# నూతన స్టోన్ క్రషర్‌కు అనుమతి ఇవ్వద్దని సర్పంచికి వినతిపత్రం



**శాయంపేట, ఫిబ్రవరి 21 (జనం సాక్షి)** పత్తిపాకలో పెద్దగుట్ట కు కొత్తగా స్టోన్ క్రషర్ ఏర్పాటు చేసే కుట్ర జరుగుతుందని, స్టోన్ క్రషర్ కి ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని గ్రామ సర్పంచ్ గజ్జి ఐలయ్యకి వినతి పత్రం ద్వారా గ్రామస్తులు తెలియజేయడం జరిగింది. గ్రామంలో గతంలో స్టోన్ క్రషర్ ఏర్పాటు చేసి వాటి బ్లాస్టింగ్ మూలంగా దుమ్ము ధూళి లతో పంట పొలాలు నాశనం అయ్యాయని, ఇల్లు పగుళ్లు పారాయని, అంతేకాకుండా భూగర్భ జలాలు అడుగంటి పోయి ప్రకృతి మొత్తం ధ్వంసం అయి గ్రామం కాలుష్యంతో కొట్టుమిట్టాడుతుందని తెలిపారు. ఇప్పటికే గ్రామ మొత్తం ప్రమాదం అంచులో ఉందని అన్నారు. ఇదే సందర్భంలో ఇప్పుడు మరొక కొత్త స్టోన్ క్రషర్ ఏర్పాటు చేసే కుట్ర జరుగుతుందని దీని ఏర్పాటు కు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని గ్రామస్తులు సర్పంచ్ కు తెలియజేశారు. పచ్చని ప్రకృతి వనరులు గుట్టలు విధ్వంసం కాకుండా బాధ్యతాయుతంగా చర్యలు తీసుకొని గ్రామాన్ని సస్యశ్యామలంగా ఉండే విధంగా చొరవ తీసుకోవాలని సర్పంచ్ కి వివరించారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా గ్రామంలో స్టోన్ క్రషర్ ఏర్పాటు చేయాలని చూస్తే ఊరుకోమని గ్రామ వనరుల సంక్షేమం కోసం పోరాడుతామని గ్రామస్తులు అన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ గజ్జి ఐలయ్య, ఉప సర్పంచ్ తుడుం రాజు , వార్డు సభ్యులు నూతన క్రషర్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వమని ప్రజా శ్రేయస్సు కోసం పని చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మొగ్గం సుమన్, పరుమాండ్ల సురేష్ తిరుపతిరెడ్డి, సాంబ రెడ్డి, రాజేంద్రప్రసాద్, తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

# గుండె ఆరోగ్యం పై మంచిర్యాలలో అవగాహన సదస్సు

### మెడిలైఫ్ హాస్పిటల్‌లో మొదటి, మూడవ శనివారాలలో కార్డియాలజిస్టు సేవలు

## సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ డా. నక్క శ్రీకాంత్




**మంచిర్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 21, (జనంసాక్షి)** మారుతున్న జీవనశైలి కారణంగా గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సికింద్రాబాద్ బ్రాంచి యశోద హాస్పిటల్ లో వైద్య సేవలు అందిస్తున్న ప్రముఖ గుండె వైద్య నిపుణులు డా. నక్క శ్రీకాంత్ సూచించారు. శనివారం మంచిర్యాల పట్టణంలోని నార్త్ ఇన్ హోటల్‌లో నిర్వహించిన గుండె ఆరోగ్య అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.... గుండెకు వచ్చే వివిధ రకాల వ్యాధులు, వాటి లక్షణాలు, నివారణ మార్గాలపై వివరించారు. సరైన ఆహారం, నిత్య వ్యాయామం, పొగతాగడం?మద్యం దూరంగా ఉంచడం, ఒత్తిడిని నియంత్రించడం వంటి జీవనశైలి మార్పులతో గుండెజబ్బులను చాలా వరకు నివారించ వచ్చని తెలిపారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ఎంతగానో అవసరమన్నారు. ఇక పై మంచిర్యాల ప్రజల సౌకర్యార్థం మెడిలైఫ్ హాస్పిటల్, మంచిర్యాలలో ప్రతి నెల మొదటి శనివారం, మూడవ శనివారంగుండె సంబంధిత వైద్య సేవలకు అందుబాటులో ఉంటానని, యశోద హాస్పిటల్ సికింద్రాబాద్ బ్రాంచిలో 365 రోజులు 24/7 ఇంటర్వెన్షన్ కార్డియాలజిస్టు ల సేవలు అందుబాటులో ఉంటాయని ఈ అవకాశాన్ని స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. గుండె ఆరోగ్యంపై ఇటువంటి అవగాహన సదస్సులు ప్రజల్లో చైతన్యం తీసుకువస్తాయని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.

# ప్రథం ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమత డిగ్రీ కళాశాల నందు జాబ్ మేళా విజయవంతం

**తొర్రూరు, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** తొర్రూరు మండల కేంద్రంలోని సమత డిగ్రీ కళాశాల నందు ప్రథం ఎడ్యుకేషన్ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ భూక్యా స్రవంతి ,యన్. ఎస్ .ఎస్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళా కి ముఖ్యఅతిథిగా కళాశాల కరెస్పాండెంట్ కోట రఘునాథ రెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వి.వెంకన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, కరెస్పాండెంట్ జాబ్ మేళా ను ఉద్దేశించి మాట్లాడుతూ జాబ్ మేళాకే విచ్చేసిన విద్యార్థినీ విద్యార్థులు యువకులు గృహిణిలు ఈ ఉద్యోగ మేళా ను సద్వినియోగం చేసుకోవాలి. ప్రథం ఎడ్యుకేషన్ ఫౌండేషన్ అనేది భారత దేశంలోని అన్ని రాష్ట్రాలలో విస్తరించింది. వారి దగ్గర వివిధ రకములైన ఉపాధి శిక్షణలు ఉన్నాయి కాబట్టి నేర్చుకొని ఉద్యోగాలు చేస్తూ మంచి స్థాయిలో ఉండాలి, అని కళాశాల కరెస్పాండెంట్ కోట రఘునాథ రెడ్డిఅన్నారు. జిల్లా కోఆర్డినేటర్ భూక్యా స్రవంతి మాట్లాడుతూ మా ప్రథం ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సంస్థ ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం. కార్ మెకానిక్, షోరూమ్ హోస్టు, ఎలక్ట్రీషియన్,ఫుడ్ ప్రొడక్షన్, కంప్యూటర్ డేటా ఎంట్రీ వంటి,జాబ్ లకు ఇంటర్వ్యూ ద్వారా ఈ జాబ్ మేళా కి 106మంది అభ్యర్థులు అటెండ్ అయిన వారిలో 30మంది అభ్యర్థులు సెలెక్ట్ అయ్యారని తెలిపారు,. ఈ కోర్సు వివరాలు రెండు నెలలు శిక్షణ పూర్తి చేసిన అనంతరం ఉద్యోగ అవకాశాలు వంద శాతం చూపిస్తున్నాం. సమత డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.



# దాతల సాకారం మరువలేనిది

- బాధిత కుటుంబానికి 53వేల రూపాయలు అందజేత



**ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** రెడ్డి ఆరోగ్య పరిస్థితి బాగోలేక ప్రవేట్ హాస్పటిల్ లో చికిత్స తీసుకోవడంతో నరసింహారెడ్డి కుటుంబం పూర్తిగా ఆర్థికంగా క్షీణించి పోవడంతో గ్రామస్తులు గ్రామ సోషల్ మీడియా ద్వారా దాతల సహకారాన్ని కోరి విరాళాలను సేకరించారు. ఆ గ్రామ యువకులు దాతల సహకారంతో వచ్చిన రూ. 53,500 విరాళాలను శుక్రవారం నరసింహారెడ్డి నివాసానికి వెళ్లి వారిని పరామర్శించి నగదు అందజేశారు. అనంతరం బాధితుడు నరసింహారెడ్డి మాట్లాడుతూ తన ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని యువకుల ముందుకు వచ్చి విరాళాలు సేకరించి తనకు అందజేయడం సంతోషకరమని వారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని వారన్నారు. కార్యక్రమంలో సామ మల్లారెడ్డి, మద్దెల లక్ష్మయ్య, ఉగ్గుమల్ల గణేష్, పిట్టల బాలకృష్ణ, మండల రమేష్, పూజారి యకాంతం తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలకు కంప్యూటర్లు బహుకరణ




**పాలకుర్తి, ఫిబ్రవరి 21(జనంసాక్షి)** మండలంలోని గూడూరు జెడ్పీఉన్నత పాఠశాలకు పాలకుర్తికి చెందిన సీఎస్ఆర్ కోఆర్డినేటర్ రాపాక నాగరాజు, ఇన్ఫోసిస్ సాఫ్ట్వేర్ కంపెనీలో మేనేజర్ గా పని చేస్తున్న రాపాక స్వాతి దంపతులు శనివారం కంప్యూటర్లను బహుకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు చదువుతో పాటు కంప్యూటర్ శిక్షణ కూడా అవసరమని అన్నారు. దీంతో విద్యార్థులు సాంకేతిక రంగాల్లో రాణించాలనే సదుద్దేశ్యంతో పాఠశాలకు రూ. 2 లక్షలు విలువ గల నాలుగు కంప్యూటర్లను అందచేసినట్లు తెలి పారు. పట్టణ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉంటాయని, గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులకు సౌకర్యాలు లేనప్పటికి అనేక మంది మట్టిలో మాణిక్యాలు ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు మాచర్ల స్వరూప– పుల్లయ్య, ఉప సర్పంచు కళ్యాణ్, ప్రధానో పాధ్యాయురాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల హామీలు నెరవేర్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం

### కృతజ్ఞతలు తెలిపిన జిల్లా అధ్యక్షుడు పాడి శెట్టి గణేష్



**శాయంపేట, ఫిబ్రవరి 21 (జనం సాక్షి)**తెలంగాణ ఉద్యమకారులకు మేనిఫెస్టోలో ఇచ్చిన టువంటి హామీలు 250 గజాలు ఇంటి స్థలం , పెన్షన్, ఇతర హామీలను నెరవేర్చే దిశ గా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , మంత్రి పొన్నం ప్రభాకర్, పిసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ కృషి చేస్తున్నారని వారికి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నుండి ,శాయం పేట మండల కేంద్రంలోని హనుమకొండ జిల్లా అధ్యక్షులు పాడి శెట్టి గణేష్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కృతజ్ఞతలు తెలుపడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గిద్దమారి సురేష్, పల్లె బోయిన సారయ్య, బాసాని విద్యాసాగర్, గిద్ద మరి రామన్న, యూత్ జిల్లా అధ్యక్షులు కొమ్ముల శివ ,మండల యూత్ అధ్యక్షులు ముంజల నాగరాజు, మండల ఉపాధ్యక్షులు ఎండి రఫీ కోశాధికారి కానుగుల నాగరాజు ,టౌన్ ప్రెసిడెంట్ రంగు మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్నీ కాపాడాలి



**బైంసా,ఫిబ్రవరి21,(జనంసాక్షి)**ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమమైన హరితహారం లో భాగంగా కామోల్ గ్రామంలోని విద్యుత్ ఉపకేంద్ర ప్రాంగణంలో విస్తృ తంగా మొక్కలు నాటారు.. గ్రామ సర్పంచ్ చింత చిన్నయ్య , రాజేశ్వర్ మహారాజ్ ఆధ్వర్యంలో మొక్క లను నాటి పచ్చదనం వైపు గ్రామాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ మహారాజ్ మాట్లాడుతూ, నాటిన ప్రతి మొక్కను పెద్ద చెట్టుగా పెంచే వరకు ప్రతిరోజూ నీరు పోసి సంరక్షణ బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించాలంటే ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసా గాలన్నారు. సర్పంచ్ చింత చిన్నయ్య మాట్లాడుతూ, హరితహారం కార్యక్రమం ద్వారా గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామ ప్రజలు కూడా మొక్కలను సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజారెడ్డి, వార్డు సభ్యులు, ఎల్.టి అంజన్న, ఎల్.ఎం దేవారావు, గోవిందు, ఏ.సి .ఎం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో రాణించి, మంచిపేరు తెచ్చుకోవాలి

### బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్



**బెల్లంపల్లి, ఫిబ్రవరి 21, (జనంసాక్షి)**యువత క్రీడల్లో రాణించి, మంచిపేరు తెచ్చుకో వాలని బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్ అన్నారు. శనివారం ఆమె బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు బెల్లంపల్లి పట్టణంలో బీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దని అన్నారు. యువత క్రీడలపై దృష్టి సారించి, రాణించి మంచి పేరు ప్రఖ్యాతులు సాదించాలన్నారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించి, క్రీడాస్ఫూ ర్తిని చాటాలన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాగంశెట్టి సత్యనారయణ, కౌన్సిలర్లు ఎండీ నిజాం, డికొండ పద్మ రాజలింగు, చింతల వసంత బాలరాజు, గాలి సుమలత శ్రీనివాస్, బేతి శ్రావణ్ కుమార్, నిచకోళ్ళ వంశీ, ఇప్ప కుమారస్వామి, నాయకులు పోలు శ్రీనివాస్, పీకా లక్ష్మణ్, పోచంపల్లి హరీష్, తాండ్ర రామకృష్ణ, పలు వార్డుల కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, టోర్నమెంట్ నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోలు పునః ప్రారంభం

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 21, (జనంసాక్షి)**సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాలు పునః ప్రారంభం అయ్యాయని బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి భాస్కర్ తెలిపారు. సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు ఈనెల 20కే ముగియగా, ప్రజాప్రతినిధుల, రైతుల విజ్ఞప్తి మేరకు ఈనెల 27 వరకు సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేయనున్నట్లు సీసీఐ అధికారులు ఆదేశాలు జారీ చేశారని వివరించారు. రైతులు సమీపంలోని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయించుకోవాలన్నారు.

# యుద్ధ వాతావరణంలో ప్రమాణస్వీకారమా

### కౌన్సిలర్ల కుటుంబాలకు అండగా ఉంటాం

### మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి21(జనంసాక్షి):** యుద్ధ వాతావ రణంలో క్యాతనపల్లి మున్సిపాలిటీలో కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం నిర్వహించటం విడ్డూరమని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రశ్నించారు. శనివారం మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ శాసనసభ్యులు పుట్ట మధు, కోరుకంటి చందర్ తో కలిసి మాట్లాడారు. మంత్రి వివేక్ అధికారులను, పోలీసు యంత్రాంగాన్ని పార్టీ కార్యకర్తలుగా వాడుకున్నారని ఆరోపించారు. న్యాయబద్ధ ంగా ప్రజలు ఇచ్చిన తీర్పును అంగీకరించకుండా మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణలు దుష్ట సంస్కృతికి తెరలేపుతున్నారని మండిపడ్డారు. సిపిఐ బిఆర్ఎస్ పార్టీలు ఉమ్మడిగా పోటీ చేసి 14 సీట్లను కైవసం చేసుకున్నప్పటికి, అధిక మెజారిటీ ఉన్న కూటమి పార్టీలకు న్యాబద్ధంగా చైర్మెన్ పదవి ఇవ్వాల్సింది పోయి, పోలీసులు, అధికార పార్టీ నాయకులకు తలొగ్గిన ఎన్నికల అధికారులు ప్రేక్షక పాత్ర వహించడం విడ్డూరంగా ఉందన్నారు. 16వ తేదీన జరగాల్సిన మున్సిపల్ చైర్మెన్ ఎన్నికను నాటకీయ పరిణామంగా వాయిదావే యడం, మరుసటి రోజుకూడా గెలిచిన కూటమి కౌన్సిలర్లను కార్యాలయానికి వెళ్లకుండా అడ్డుపడి, యుద్ధ వాతావరణం సృష్టించి దాడికి పాల్పడడం దురదృష్టకరమన్నారు. కూటమి పార్టీలకు ప్రాతినిథ్యం వహించిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ జరుగుతున్న పరిస్థితులను నిరోదించడానికి ప్రయత్నించగా అక్రమ కేసులు బనాయించారని అన్నారు. దుర్మార్గ చర్యలకు పాల్పడి దొడ్డిదారిన చైర్మెన్ పదవిని చేజిక్కించుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పాల్పడడం సరికాదని, ప్రజల తీర్పును గౌరవించకపోతే రానున్న రోజుల్లో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. గెలిచిన కౌన్సిలర్ల కుటుంబాలను కాంగ్రెస్ నాయకులు భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. కూటమి కౌన్సిలర్ల కుటుంబాలకు బిఆర్ఎస్ రాష్ట్ర అధినాయకత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో టిబిజికెఎస్ నాయకులు మిర్యాల రాజిరెడ్డి, కూటమి నాయకులు కలవేన శంకర్, రామడుగు లక్ష్మణ్, కంబగోని సుదర్శన్ గౌడ్ పాల్గొన్నారు.

# సేవాలాల్ మార్గమే మన మార్గం కావాలి

### సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలలో పాల్గొన్న

### ఎమ్మెల్యే నాయిని



**హనుమకొండ ప్రతినిధి ఫిబ్రవరి 21 (జనం సాక్షి)** :హనుమకొండ గిరిజన భవన్ లో శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు సేవలాల్ మహారాజ్ కమిటీ ఆధ్వర్యంలోహనుమకొండ జిల్లా గిరిజన భవన్ లో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి కార్యక్రమం డిస్టిక్ డెవలప్మెంట్ ఆఫీసర్ ప్రేమకళ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంరమేష్ రాథోడ్ ఆర్డిఓ హనుమకొండ పర్యవేక్షణలో నిర్వహించడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా సన్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జన్మదిన వేడుకలను నిర్వహించాలని ప్రభుత్వ శాఖలకు ఆదేశించింది. ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సభ అధ్యక్షులుగా వి ఎన్ నాయక్, వ్యవహరించారు . ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ, సేవాలాల్ మహారాజ్ గొప్ప తాత్వికవేత్త, సామాజిక పరివర్తకులు, గోర్ బంజారా జాతి ఐక్యత కోసం కృషిచేసిన మహనీయుడు అని కొనియాడారు. ఈ వేడుకలలో గాయని ఫోరిక నాగమణి జవహర్లాల్ ఆలపించిన పాటలు సబికులందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో లంబాడ లైవ్ ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షులు లావుడియా పల్లవి రాజు నాయక్, నునావత్ జవహర్లాల్, సమ్మయ్య రాథోడ్, సోము నాయక్. అర్పితా బాయ్, రిటైర్డ్ ఆర్డిఓ విద్యాసాగర్ నాయక్, జవహర లాల్ , ప్రొఫెసర్ రమేష్ నాయక్. భూక్య శ్రవణ్ కుమార్, .మూడ్ రమేష్, రాష్ట్ర నాయకుడు సునీల్ నాయక్. అజ్మీర వెంకట్, రమేష్, సర్పంచ్ రవి, కార్పొరేటర్ లావుడియా రవి నాయక్, జై సింగ్, అనసూయ బాయ్, సోనీ, కవిత గిరిజన విద్యార్థి నాయకులు శ్రావ్య శిరీష పావని శ్రావణి రమేష్ లాలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**స్టేషన్ ఘన్పూర్ ,ఫిబ్రవరి 21 ( జనం సాక్షి ) :**పేదల సొంత ఇంటి కళను సాకారం చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని మాజీ ఉప ము ఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. చిల్పూర్ మండలంలోని శ్రీపతిపల్లి లో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఈ సందర్బంగా లబ్ధిదారు కుటుంబ సభ్యులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించారు. అనంతరం ఇంటి నిర్మా ణాన్ని పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయ కత్వంలోని ప్రజా ప్రభుత్వంలోనే నిరుపేద ప్రజల సొంత ఇంటి కల వాస్తవ రూపం దాలుస్తున్నాయ ని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 22వేల 500కోట్ల రూపాయలతో 4లక్షల 50వేల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపా రు. అందులో భాగంగానే స్టేషన్ ఘనపూర్ నియో జకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని, కొన్ని నిర్మాణాలు పూర్తి చేసుకొని గృహప్రవేశం జరుగుతుండగా మరికొన్ని వివిధనిర్మాణదశల్లోఉన్నట్లు తెలిపారు. 85శాతం ఇంది రమ్మ ఇండ్ల నిర్మాణాలు ప్రారంభిం చి ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం మొదటిస్థానంలో ఉందని వెల్లడిం చారు. ఈసారి ప్రభుత్వం లబ్ధిదారులకు కొన్ని వెసులుబాటులు కల్పించిందని అందులో అనుమతులు రాకముందే బేస్మెట్ కట్టుకున్న వాళ్లకు, గతంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయి బేస్మెట్ వరకే నిర్మాణం చేసుకున్న వారికీ సైతం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయనున్న ట్లు అందుకు సంబందించిన జీవో నెంబర్ 96ను కూడా నిన్ననే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింద ని వెల్లడించారు. గతంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయి బేస్మెట్ లెవల్ కట్టుకున్న వారికీ 4లక్షలు, రూఫ్ లెవల్ నిర్మాణం అయిన ఇంటికి 3లక్షల ఆర్థిక సహాయం అందించే విధంగా వెసు లుబాటు కల్పించిందని తెలిపారు. రానున్న మూడేళ్లలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూ రు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిల్పూర్ దేవస్థాన కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, స్థానిక మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పండు తింటే నిండు జీవితం సాధ్యం




## మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్

**తొర్రూరు, ఫిబ్రవరి 21(జనం సాక్షి) :** నిత్యజీవితంలో ఆహారంలో పండ్లను భాగంగా చేసుకుంటే నిండు ఆరోగ్యకరమైన జీవితం సాధ్యమని మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్ సూచించారు. డివిజన్ కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ లో శనివారం ఫ్రూట్స్ డే నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ అనుమాండ్ల దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు 102 రకాల పండ్లను ప్రదర్శించారు. ఏ పండులో ఏ ప్రయోజనం దాగి ఉందో చార్టుల రూపంలో విద్యార్థులు వివరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్ తో కలిసి చైర్మన్ శ్రావణ్ మాట్లాడారు. నేటితరం ఆరోగ్యకరమైన ఆహారానికి దూరమవుతుందని, ప్యాకేజ్, జంక్ ఫుడ్ కు బానిస అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రోజు పండ్లను భాగంగా చేసుకుంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. ప్రకృతి మనకు ప్రసాదించిన అపురూప వరం పండ్లు అని, నిత్యం పండ్లు తీసుకోవడం వల్ల విటమిన్లు ఖనిజాలు పీచు పదార్థాలు లభించి గుండె జబ్బులు క్యాన్సర్ వంటి వ్యాధులు దరిచేరవన్నారు. ప్రతి సీజన్లో దొరికే పండ్లను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం నూతన చైర్మన్, వైస్ చైర్మన్ లను పాఠశాల యాజమాన్యం సత్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు నాగిరెడ్డి, సంపత్, సునీత, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, ఇమ్మడి రాంబాబు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పరకాలలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలి

## ఎమ్మెల్యే రేవూరికి రైతు రక్షణ సమితి వినతి



**పరకాల, ఫిబ్రవరి 21 (జనం సాక్షి)**హనంకొండ జిల్లా పరకాల డివిజన్‌లో కృషి విజ్ఞాన కేంద్రం (కెవికె) ఏర్పాటు చేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి నీ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ రావు మాట్లాడుతూ పరకాల డివిజన్ పరిధిలోని నడికూడ తదితర మండలాల్లో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందన్నారు. ప్రస్తుతం ఈ ప్రాంత రైతులు పంటలకు సంబంధించిన సమస్యలు, సాంకేతిక సూచనల కోసం వరంగల్‌లోని కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. పరకాలలోనే కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేస్తే స్థానిక రైతులకు తక్షణ సాంకేతిక సహాయం, పంటలపై శిక్షణ, సమస్యల పరిష్కారం సులభంగా లభిస్తాయని పేర్కొన్నారు. హనంకొండ జిల్లాకు కేటాయించిన కృషి విజ్ఞాన కేంద్రాన్ని పరకాల డివిజన్‌లోనే ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్, వ్యవసాయ విశ్వవిద్యాలయ అధికారులు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

# పత్తిపాక గ్రామంలో సైబర్ నేరాల పట్ల అవగాహన

## ఉచితంగా డబ్బులు వస్తాయి అంటే నమ్మకండి

## ఎస్సై జక్కుల పరమేశ్వర్



**శాయంపేట ,ఫిబ్రవరి 21 (జనం సాక్షి)**శాయంపేట మండలం పత్తిపాక గ్రామంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో సైబర్ నేరాల పట్ల ,ఆర్థిక క్రమశిక్షణ పట్ల అవగాహన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి మారపల్లి క్రాంతి కుమార్ సి ఎఫ్ ఎల్ కౌన్సిలర్ అధ్యక్షత వహించగా,ముఖ్య అతిథులుగా శాయంపేట ఎస్సై జక్కుల పరమేశ్వర్ ,పత్తిపాక సర్పంచ్ సర్పంచ్ ఐలయ్య లు హాజరై మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వీడియోల ద్వారా, మరియు ఆన్లైన్ మోసాలు రోజురోజుకూ విపరీతంగా పెరిగిపోయి, ఏది నిజం, ఏది అబద్ధం, అని తెలుసుకోలేక ప్రజలు అయోమయంలో ఉంటున్నారు. వీటికి తోడుగా వాట్సాప్ గ్రూప్ లలో వచ్చే అపరిచిత లింకుల ద్వారా ఉచితంగా డబ్బులను సంపాదించవచ్చు అని మెసేజ్ లు రావడంతో వాటి ఆ లింకులను ఓపెన్ చేసి నష్టపోయిన వారు చాలామంది ఉన్నారు అన్నారు. అదేవిధంగా ఎటువంటి పూచి కత్తు లేకుండా లోన్స్ ఇస్తామని ఈ లింకులను ఓపెన్ చేయండి అని అనడంతో ఈ విధంగా కూడా చాలామంది నష్టపోయిన వారు ఉన్నారు, మరియు అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు చెప్పడం, మరియు అనధికార లింకులను ఓపెన్ చేయడం వల్ల సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఫోన్ పే లేదా గూగుల్ పే ద్వారా మనకు డబ్బులు పంపించి, మనకు డబ్బులు పడినట్టు మెసేజ్ లు కూడా వచ్చి ఆ డబ్బులు పొరపాటున మీకు వచ్చాయి దయచేసి మా ఈ నెంబర్ కి తిరిగి పంపండి అని అనడంతో, అలా పంపించడం ద్వారా కూడా చాలామంది డబ్బులు పోగొట్టుకున్న వారు ఉన్నారు. కాబట్టి వీటన్నింటి నుండి జాగ్రత్త పడాలంటే అపరిచిత వ్యక్తులు పంపించిన లింకులను ఓపెన్ చేయవద్దు, ఓటిపి ఎవరికీ చెప్పవద్దు, లింకుల ద్వారా ఎవరికీ డబ్బులు పంపించవద్దు, అని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామఉప సర్పంచ్ రాజు, కుమార స్వామి, మారపల్లి విజయ్, మరియు తదితరులు పాల్గొన్నారు.

# భూ సర్వేకు ప్రజలు సహకరించాలి



**ఖానాపూర్ ఫిబ్రవరి 21 (జనం సాక్షి)**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి రి సర్వే కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని తాహసిల్దార్ సుజాత రెడ్డి కోరారు. శనివారం నిర్వహించిన భూ భారతి రీ సర్వే రైతు అవగాహన గ్రామసభలో తహసిల్దార్ సుజాత రెడ్డి మాట్లాడారు. మండలంలో బావాపూర్ (ఆర్) గ్రామాన్ని భూ భారతి రీ సర్వే నిమిత్తం ప్రభుత్వం ఎంపిక చేసిందని ఈ గ్రామంలో భూ సర్వే నిర్వహించనున్నట్లు గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా సర్వే ఏడి నర్సింలు భూ సర్వే విధి విధానాలపై ప్రజలకు వివరించారు. ప్రతి సర్వే నెంబర్ ఆధారంగా పూర్తిస్థాయిలో కొలతలు చేయబడతాయని స్థానిక ప్రజలు, రైతులు సర్వే అధికారులకు సహకరించి తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాస మంగమ్మ, మండల సర్వేయర్ కిషన్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ లతో పాటు రెవెన్యూ సిబ్బంది, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



**సారంగాపూర్, ఫిబ్రవరి 21(జనం సాక్షి)**యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి రాధిక సూచించారు. శనివారం నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని చించోలిలోని ఎంజేపీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. మత్తుకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని, ఎవరైనా వీటిని విక్రయించినా, రవాణా చేసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, ప్రిన్సిపాల్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరం

**ఖానాపూర్ ఫిబ్రవరి 21(జనం సాక్షి)**మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శనివారం సర్పంచ్ ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు రోగ నిర్ధారణ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిచేసినట్టు తెలిపారు. ప్రజలు రోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించే విధంగా ఈ శిబిరాన్ని జిల్లా కేంద్రం నుండి ప్రత్యేక వైద్యులను రప్పించి నిర్వహించినట్లు ప్రశాంత్ రెడ్డి తెలిపారు.

# భైంసా నూతన మున్సిపల్ చైర్మన్ లకు ఘన సన్మానం



**ముధోల్, ఫిబ్రవరి 21 (జనం సాక్షి)** భైంసా పట్టణంలోని నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తు, వైస్ చైర్మన్ ఇద్రిజ్, కౌన్సిలర్లను మండల కేంద్రమైన ముధోల్ బిజెపి నాయకులు శనివారం ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత పాలకుల హయాంలో ఏలాంటి అభివృద్ధి భైంసా పట్టణంలో జరగలేదని అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. అభివృద్ధికి యువత పెద్దపీట వేయాలని కోరారు. సన్మానించిన వారిలో బిజెపి నాయకులు ధర్మపురి సుదర్శన్, తాటివార్ రమేష్, మైత్రి సాయినాథ్, బత్తినోళ్ల సాయి, సంగొల్ల పోతన్న, రాంకీ, కోరి సాయి, జెబాజీ చిన్ను తోపాటు యువకులు తదితరులు పాల్గొన్నారు

# మున్సిపల్ చైర్మన్ అప్పాల కావ్య గణేష్ ను సన్మానించిన మున్నూరుకాపు సంఘ సభ్యులు



**నిర్మల్ రురల్,ఫిబ్రవరి,21,(జనంసాక్షి)** నూతనంగా ఎన్నికైన నిర్మల్ మున్సిపల్ చైర్మన్ అప్పాల కావ్య గణేశ్ చక్రవర్తి ని శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బెస్తవార్ పెట్ మున్నూరుకాపు సంఘ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా పులమాలతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా బెస్తవార్ పెట్ లో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కాలనిలో వీధి లైట్లు, మురికి కాలువలు,సిసి రోడ్లు నిర్మాణం చేపట్టాలని విన్నవించారు. అనంతరం 25 వార్డ్ కౌన్సిలర్ లక్కకుల హరీశ్,24 వార్డ్ కౌన్సిలర్ ఒడిసెల అర్జున్ లను శాలువా మెమొంటోలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు తోట రమేష్,ప్రధాన కార్యదర్శి గుమ్ముల అశోక్,కోశాధికారి తోట రవి, తోట రమేష్,ఆకుల ఆశోక్, బోడ శ్రీనివాస్, ఉల్లిగడ్డల రాజలింగం,బండారి రాజేశ్వర్,ఆర్కారి స్వామి,ఆకుల నర్సయ్య, బోడ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

# ముల్కనూరులో ఉచిత మెగా వైద్య శిబిరం

- 863 మందికి నాణ్యమైన వైద్య సేవలు

**భీమదేవరపల్లి, ఫిబ్రవరి 21 (జనం సాక్షి)** : రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరు మోడల్ స్కూల్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతంగా జరిగింది. ఈ శిబిరాన్ని స్థానిక సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి,జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. ఏ.అప్పయ్య, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్ సంయుక్తంగా ప్రారంభించారు.జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ శిబిరాన్ని సందర్శించి సేవల నిర్వహణను పరిశీలించారు. హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మరియు జనగామ ప్రభుత్వ వైద్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరం గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేయబడింది. కలెక్టర్ ఓపీ నమోదు కేంద్రాలు,ప్రాథమిక పరీక్షల కౌంటర్లు, ఫార్మసీ విభాగాలను పరిశీలించి, సేవలు సమర్థంగా అందించాలని వైద్యులకు సూచించారు.జనరల్ ఫిజీషియన్‌తో పాటు ఎముకలు, శస్త్రచికిత్స,పిల్లల వైద్యం, చెవి–ముక్కు–గొంతు, చర్మవ్యాధి,కంటి,స్త్రీ రోగ నిపుణులు సేవలందించారు. ప్రత్యేకంగా మొబైల్ ఎక్స్‌రే,ఈసీజీ సదుపాయాలు ఏర్పాటు చేసి అవసరమైన పరీక్షలు నిర్వహించారు. గ్రామాల వారీగా హాజరైన సర్పంచులతో మాట్లాడి ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. జనగామ వైద్య కళాశాల, జిల్లా ఆసుపత్రి నుంచి 8 విభాగాలకు చెందిన 14 మంది స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొన్నారు. ముల్కనూర్, వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని డాక్టర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, మహిళా సమాఖ్య సభ్యులు గ్రామస్తులను శిబిరానికి తీసుకువచ్చారు. మొత్తం 75 మంది వైద్య, పారామెడికల్ సిబ్బంది సేవలందించారు. ఈ శిబిరంలో మొత్తం 863 మంది వైద్య సేవలు పొందారు. విభాగాల వారీగా జనరల్ మెడిసిన్ – 284, ఎముకల సమస్యలు –143, పిల్లల వైద్యం – 93, చర్మవ్యాధులు – 44, చెవి–ముక్కు–గొంతు – 49, జనరల్ సర్జరీ – 26, స్త్రీ రోగాలు – 34, కంటి సమస్యలు – 190, మొత్తం 310 ల్యాబ్ పరీక్షలు, 89 ఎక్స్‌రేలు, 40 ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. మరింత చికిత్స కోసం 12 మందిని ఎంజీఎం, జీఎంహెచ్ ఆసుపత్రులకు రిఫర్ చేయగా, 18 మందిని కాటరాక్ట్ శస్త్రచికిత్స కోసం పంపించారు. సుమారు రూ.1,800 విలువైన ల్యాబ్ పరీక్షలను ప్రతి ఒక్కరికీ ఉచితంగా నిర్వహించగా,రూ.5 లక్షలకుపైగా విలువైన మందులను పంపిణీ చేశారు.జిల్లా కెమిస్టు అండ్ డ్రగ్గిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు మృత్యుంజయ రెడ్డి రూ.1 లక్ష విలువైన మందులను అందజేశారు. దృష్టిలోపం ఉన్న 54 మందికి పెద్ది వసంత ఫౌండేషన్ ద్వారా కళ్లద్దాలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రజలు పట్టణాలకు వెళ్లకుండానే స్పెషలిస్ట్ వైద్య సేవలు పొందేలా ఇలాంటి శిబిరాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డా.ఏ. అప్పయ్య, రెడ్ క్రాస్ ప్రతినిధులు, స్థానిక తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశం, సర్పంచ్ ప్రమోద్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి పూర్ణచందర్, మెడికల్ ఆఫీసర్లు,రెహమాన్, రాజశేఖర్,కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షులు జక్కుల అనిల్ పోగుల శ్రీకాంత్, చిట్కురి అనిల్, వివిధ గ్రామాల సర్పంచులు ప్రజాప్రతినిధులు, వైద్యులు అధికారులు వివిధ గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# అంగన్వాడీ కేంద్రాల సేవలు సద్వినియోగం చేసుకోవాలి

**తొర్రూరు, ఫిబ్రవరి 21 (జనం సాక్షి):** అంగన్వాడి కేంద్రాల సేవలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని నాంచారి మదూరు సర్పంచ్ బంగారు రమేష్ తెలిపారు.శనివారం మండలంలోని నాంచారి మదూరు గ్రామ 1, 3 అంగన్వాడీ కేంద్రాలలో ఏఎల్ఎం ఎస్ సీ కమిటీని ఎన్నుకున్నారు.సర్పంచ్ కమిటీ చైర్మన్ గా,అంగన్వాడి టీచర్ కన్వీనర్ గా,11 మంది స్థానికులను సభ్యులుగా కమిటీని ఎనుకున్నారు.అనంతరం అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణీలకు అందిస్తున్న గుడ్లు, ఇతర పౌష్టికాహారాన్ని సర్పంచ్ పరిశీలించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల ఆరోగ్యం కోసం అంగన్వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయని, పౌష్టికాహార లోపం తలెత్తకుండా సేవలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు బి.యాకలక్ష్మి,ఏ. విజయలక్ష్మి,డాక్టర్ మాధవి, ఏఎన్ఎం శోభ, ఆశా కార్యకర్తలు సోమక్క, స్వరూప, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు



**పర్వతగిరి,ఫిబ్రవరి 21,(జనం సాక్షి) :** పర్వతగిరి మండలం రోళ్ళకల్ చెరువుముందు తండాలో నిర్వహించిన శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు సందర్భంగా జరిగిన ముంగిపు కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. ఈ వేడుకల్లో గిరిజన సోదర సోదరీమణులతో కలిసి పాల్గొని డాన్స్ చేసిన కేఆర్ నాగరాజు,వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే (విశ్రాంత ఐపీఎస్ అధికారి), స్థానిక ప్రజల హృదయాలను గెలుచుకున్నారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ కార్యక్రమంలో ఆయన చురుకుగా పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజలతో కలిసి ఉత్సవాల్లో భాగమవడం ద్వారా వారి ఆనందాన్ని పంచుకోవడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు.




# విద్యార్థులకు టై, బెల్ట్స్ పంపిణీ

**పాలకుర్తి, ఫిబ్రవరి 21(జనంసాక్షి)** మండలంలోని పెద్దతండా (కే) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు జిల్లా రిటైర్డ్ ఉపాధ్యాయుల అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం టై, బెల్ట్, బ్యాడ్జీలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం ప్రధాన కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని అన్నారు. పట్టుదల, క్రమశిక్షణ కలిగి ఉంటారని అన్నారు. అనంతరం విద్యార్థులకు 6 వేలు విలువ గల టై, బెల్ట్స్, బ్యాడ్జీలను అందచేశారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం మంజుల, ఉపాధ్యాయు లు శేషగిరిరావు. అనిల్, నవీన్, అంగన్వాడీ టీచర్ సునిత పాల్గొన్నారు.

# 40 లీటర్ల నాటు సారా పట్టివేత

మహదేవపూర్:ఫిబ్రవరి 21(జనంసాక్షి) మధ్య పూర్ మండలంలోని అంబటిపల్లి గ్రామానికి చెందిన వావిలాల లక్ష్మి. బీసుల జయ. శ్యామల యశోద. మీనుగు కేశవ్. జీడి సమ్మయ్య అను వారి వద్ద నుండి 40 లీటర్ల నాటు సారాను స్వాధీన పరుచుకొని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్ కుమార్ తెలిపారు.

# ముధోల్‌లో మాతృభాష దినోత్సవ వేడుకలు



**ముధోల్,ఫిబ్రవరి 21(జనం సాక్షి) :** మండల కేంద్రమైన ముధోల్ లోనిశ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల, శ్రీ అక్షర పాఠశాల,రవీంద్ర పాఠశాల, లిటిల్ ఫ్లవర్ ,ఎడిబిడ్ లోని ఫ్యూచర్ పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ లు మాట్లాడుతూ అమ్మ నుండి నేర్చుకోబడిన భాష మాతృభాషని గౌరవించాలని తెలియజేశారు. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో మాతృభాషలో కనుమరుగయ్యే స్థితిలో ఉన్నాయన్నారు. దేశంలోనే తెలుగు మాతృభాష ఎంతో విలువైన పేర్కొన్నారు. మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకొనిపాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, కవిత పోటీలను నిర్వహించగ గెలుపొందిన విద్యార్థులకు బహుతులను ప్రధానం చేశారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అసంవార్ సాయినాథ్, జారికోట్ సుభాష్ ,సారథి రాజు, ముజీబ్ ఖాన్,ప్రవీణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తానూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 21 లక్షల రూపాయల నిధుల మజూరు

- ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



**బైంసా, ఫిబ్రవరి21 (జనంసాక్షి) :** తానూర్ ప్రభుత్వ జూనియర్ కళశాల కు 21 లక్షల రూపాయల నిధులు మంజూరైనట్లు శనివారం ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తెలిపారు.ఇంటిగ్రెటెడ్ సైన్స్ మాథ్స్ ల్యాబ్ కు ఈ నిధులు మంజూరైనట్లు చెప్పారు.సమగ్ర శిక్ష అభియాన్ కింద కేంద్ర ప్రభుత్వం ఈ నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు.విద్యార్థుల కు ఆధునిక టెక్నాలజీ తో ల్యాబ్ లను రూపొందించేందుకు ఈ నిధులు విడుదల చేసిందన్నారు..

# యువ రైతులకు ప్రభుత్వం పది లక్షల ఫిక్స్డ్ డిపాజిట్ చేయాలి

- యువ రైతులకు పిల్లనివ్వడానికి ముందుకు రాని వైనం
- తాజా మాజీ జెడ్పిటిసి ఓస రాజేశ్వర్.



**లక్ష్మణ చాంద, ఫిబ్రవరి 21, (జనం సాక్షి):** వ్యవసాయ యువకులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలబడాలని తాజా మాజీ జెడ్పిటిసి ఓస రాజేశ్వర్ కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రోజు రోజుకి దేశానికి అన్నం పెడుతున్న యువ రైతులకు పెళ్లి చేసుకోవడం కష్టంగా ఉందన్నారు. వ్యవసాయం చేసే యువకులకు పిల్లనివ్వడానికి ఎవరు ముందుకు రావడం లేదని, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం కు అన్ని వ్యవసాయ సంఘాలు ఇచ్చిన సూచన వలెనే మన తెలంగాణ రాష్ట్రంలోని అన్ని పార్టీల నాయకులు ముందుకు వచ్చి తెలంగాణలో కూడా వ్యవసాయం చేసే యువకులకు పిల్ల పేరిట రాష్ట్ర ప్రభుత్వం తరఫున పది లక్షల రూపాయల ఫిక్స్డ్ డిపాజిట్ చేసి వివాహం జరిగే లా చర్యలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.లేదంటే రానున్న కాలంలో ఎవరు వ్యవసాయం చేయడానికి ముందుకు రారని ఆయన తెలిపారు.

# గాంధీ నగర్‌లో ఉచిత మెడికల్ క్యాంప్

- సర్పంచ్ బానోత్ నిర్మల వెంకన్న



**గోవిందరావుపేట (జనంసాక్షి) :** మండలం లోని గాంధీనగర్ గ్రామంలో ఇషా కేర్ హాస్పిటల్ సహకారంతో శనివారం గ్రామపంచాయతీ ఆవరణములో ఉచిత మెగా మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు, గ్రామ సర్పంచ్ బానోతు నిర్మల వెంకన్న క్యాంపును ప్రారంభించారు ఈ సందర్భంగా సర్పంచ్ నిర్మల వెంకన్న మాట్లాడుతూ మారుమూల గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి ప్రజలకు ఉచిత వైద్యం అందించడానికి ముందుకు వచ్చిన ఇషా కేర్ హాస్పిటల్ యాజమాన్యానికి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు, సుమారు 160 మంది రోగులను వైద్యులు పరీక్షలు చేసి మందులు అందించారు, ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వల్లపు మహేష్, వార్డు సభ్యులు తేజవత్ హుని లకావత్ ఈర్య, కూరాకుల సురేష్, మాలోత్ శంకర్ కార్యదర్శి భారతి ఇషా కేర్ డాక్టర్, ప్రేమ్ సింగ్ వేణు సిబ్బంది పాల్గొన్నారు

# కొడవటంచలో విగ్రహ పునః ప్రతిష్టాపన మహోత్సవం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కొడవటంచలో శనివారం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి విగ్రహ పునః ప్రతిష్టాపన కార్యక్రమం అత్యంత వైభవోపేతంగా జరిగింది. కార్యక్రమానికి శ్రీ త్రిదండి చినజీయర్ స్వామి, శాసనసభ సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు దంపతులు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తదితరులు పాల్గొన్నారు.

**- జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, జనంసాక్షి..**











## నేడు జిల్లా పెరిక సంఘ సమావేశం...

కడెం: ఫిబ్రవరి 21(జనం సాక్షి) నేడు కడెం మండలంలోని కొండుకూర్ గ్రామంలో రాష్ట్ర పెరిక కుల సంఘ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు చుంచుభూమన్న, ఉపాధ్యక్షుడు రాజు,మండలాధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ పిలుపునిచ్చారు.ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు ఘటిక విజయ్ కుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సుంకరి ఆనంద్,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కీత విజయ్ కుమార్, రాష్ట్ర భవన కమిటీ ఉపాధ్యక్షుడు సుంచు ఉషన్న , మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బొద్దు శంకర్ హాజరుకానున్నట్లు శనివారం రోజున ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎన్నికల్లో గెలిచిన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేషన్ పదవులు పొందిన పెరిక కుల ప్రజాప్రతినిధులకు రాష్ట్ర కమిటీ సభ్యులచే సన్మానం కార్యక్రమం చేయనున్నట్లు పేర్కొన్నారు.

## పర్వతగిరిలో పలువురిని పరామర్శించిన మాజీ జెడ్పిటిసి మెడిశెట్టిరాములు



పర్వతగిరి, ఫిబ్రవరి 21,(జనంసాక్షి) : పర్వతగిరి మండల కేంద్రంలో ఇటీవల తురకల సోమారం వద్ద ప్రమాదానికి గురై స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న బంధారపు రంజిత్ ను,ఇటీవల అల్వాల వీరస్వామి మాతృమూర్తి మరణించగా పరామర్శించి ధైర్యం చెప్పిన పర్వతగిరి మండల సీనియర్ రాజకీయ నాయకులు, మండల ప్రథమ జడ్పిటిసి సభ్యులు మేడిశెట్టి రాములు ఆయన వెంట నాయకులు గోనే సంపత్ సందెల నవీన్ మహమ్మద్ సర్వర్ కంటెం ఏకాంతం,కాంటెస్టెడ్ సర్పంచ్ సింగారం రమేష్,డాక్టర్ శ్రీనివాస్,కొండ వెంకన్న,బోట్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## పిల్లల ఎత్తు, బరువులు తప్పనిసరి

**సిడిపిఓ శ్రీలత**

**భానాపూర్ ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు ఎత్తు బరువులు తప్పనిసరిగా కొలతలు వేయాలని తూకం చేయాలని సిడిపిఓ శ్రీలత అన్నారు. శనివారం ప్రాజెక్టు పరిధిలోని భాదనకుర్తి, చింతల్ పేట, మస్కాపూర్ గ్రామాలలోని అంగన్వాడీ కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాలలోని అంగన్వాడీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. రికార్డులు ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని, మెనూ తప్పక పాటించాలని, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు.

## శివాలయం ఏర్పాటు కోసం ప్రత్యేక సమావేశం



**గోవిందరావుపేట (జనంసాక్షి) :** పసర గ్రామంలో శివాలయం ఏర్పాటు కోసం నేడు పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ సుమలత సక్రనాయక్ తెలిపారు. శనివారం మీడియాతో సుమలత మాట్లాడుతూ పసర గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామస్తులతో ఆదివారం రోజున ఉదయం 10.30 గంటలకు గ్రామపంచాయతీ ఆవరణంలో సమావేశం ఏర్పాటు చేసుకొని నూతన శివాలయ నిర్మాణ కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుంది. పసర గ్రామంలో గల ఆలయ నిర్మాణ ఆసక్తి గల శివ భక్తులు పాల్గొని కమిటీ నిర్మాణం చేసుకోవాలని అన్నారు.

# అభివృద్ధి పనులను ప్రారంభించిన సర్పంచ్



**బెల్లంపల్లి, ఫిబ్రవరి 21, (జనంసాక్షి) :** బెల్లంపల్లి మండలం చాకెపల్లి గ్రామంలో శనివారం సర్పంచ్ మౌనిక నరేష్ ప్రారంభించారు. గ్రామంలో ప్రధాన సమస్యల పరిష్కారంలో భాగంగా బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు, తాజామాజీ ఎంపీటీసీ ముడిమడుగుల మహేందర్ కృషితో డిఎంఎఫ్టీ నిధులతో ఆటో స్టాండ్ నుంచి బోడకుంట లింగయ్య ఇంటి వరకు ఐదు లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. స్మశాన వాటికలో బోర్వెల్ ఉన్నప్పటికీ సరైన సదుపాయాలు లేకపోవడంతో ప్రజల ఇబ్బందులను అర్థం చేసుకొని వాటర్ షవర్ ను పంచాయితీ నిధుల నుండి శంకుస్థాపన చేశారు. పోచమ్మ గుడికి వెళ్ళడానికి, ఆ పక్క భూములు ఉన్న రైతులకు ఇబ్బందికరంగా ఉన్నటువంటి కల్వర్ట్ నిర్మాణానికి పనులు ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా రోడ్డు లేక క్వార్టర్స్ ప్రజల ఇబ్బందిని దృష్టిలో ఉంచుకొని సీసీ రోడ్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆకుల రాంచందర్, మండల నాయకులు జుమ్మిడి బానయ్య, గుమాస శ్రీకాంత్, మాజీ సర్పంచ్ జంబి సత్తయ్య, మాజీ ఉప సర్పంచ్ చదువుల రమేష్, మాజీ ఎంపిటిసి ఇప్ప రవి, వార్డు సభ్యులు గొర్లపల్లి మాధవి, గ్రామ పెద్దలు దాది రాజేష్, జక్కం తిరుపతి, యాట రాజన్న, బోడకుంట సోమయ్య, ముత్త బుచ్చయ్య మీస సత్యం, మార్త మల్లేష్, గోప రమేష్, యువజన నాయకులు తోట అనిల్ , దుర్గం రాజ్ కుమార్, కొట్ల వినోద్, వరిమడ్ల తిరుపతి, కొట్ల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## లో ఓల్టేజ్ విద్యుత్ సమస్యను తీర్చిన సర్పంచ్



**కొటాల ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** గత రెండు సంవత్సరాలుగా గ్రామ ప్రజలు లో ఓల్టేజ్ విద్యుత్ సమస్యతో ఇబ్బంది పడుతున్న వారి సమస్యను కొటాల మండలంలోని శీర్న గ్రామ సర్పంచ్ మల్లేష్ తీర్చారు. లో ఓల్టేజ్ సమస్య పై గ్రామస్తులు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన సర్పంచ్ విద్యుత్ శాఖ వారికి సమాచారం అందించారు.పాడైపోయిన డీ టీ ఆర్ స్థానంలో నూతన డీ టి ఆర్ ను అమర్చిలో ఓల్టేజ్ లేకుండా చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సర్పంచ్ ను అభినందించారు.విద్యుత్ శాఖ ఏ ఈ అంజల్ కుమార్, జే ఎల్ ఎం సత్యన్న, సిబ్బంది గ్రామ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# భైంసా లో విజ్మోని అంతర్జాతీయ ప్రమాణాల ఆర్థిక సేవలు




**భైంసా ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** భైంసా పట్టణంలో విజ్మోని సంస్థ నూతన శాఖను ఈ జోనల్ హెడ్ శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జోనల్ హెడ్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, భైంసా పరిసర ప్రాంత అంతర్జాతీయ ప్రమాణాల ఆర్థిక సేవలను అందుబాటులోకి తీసుకురావడమే ఈ శాఖ ప్రారంభం యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కస్టమర్ సంతృప్తి, పారదర్శకత మరియు వేగవంతమైన సేవలే ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. ఈ శాఖ ద్వారా విదేశీ కరెన్సీ మార్పిడి, విదేశాలకు డబ్బు పంపే సౌకర్యం, ఫారెక్స్ ట్రావెల్ కార్డ్ సేవలు, విమాన టికెట్ బుకింగ్, హాలిడే ప్యాకేజీలు, తక్కువ వడ్డీ రేటుతో గోల్డ్ లోన్లు వంటి సేవలు అందిస్తుంది. అదేవిధంగా, సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సి ఎస్ ఆర్ కార్యక్రమాలలో భాగంగా సామాజిక సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా స్థానిక శిశుమందిర పాఠశాల విద్యార్థులకు పాఠశాల బ్యాగులు పుస్తకాలను పంపిణీ చేశారు.అదనంగా విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలకు నీటి డిస్పెన్సర్లు అందజేశారు. సమాజ అభివృద్ధికి విజ్మోని కట్టుబడి ఉందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజినల్ హెడ్ రాజ్‌కుమార్ కార్యాలయ సిబ్బంది కస్టమర్లు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటనను జయప్రదం చేయండి

**మద్దాలి నాగమణి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు**

**గోవిందరావుపేట (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటనను జయప్రదం చేయాలని జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మద్దాలి నాగమణి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం మీడియాతో నాగమణి మాట్లాడుతూ ఉదయం 11:00 గంటలకు కన్నాయిగూడెం మండలం దేవాదుల ప్రాజెక్టు పర్యటనకు ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచ్చేస్తున్నారు. కావున ములుగు జిల్లాలోని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ మహిళా నాయకులు అందరూ బతుకమ్మ చీరలు కట్టుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక ఆహ్వానం పలికి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.